పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# సీఎం పర్యటన ఏర్పాట్లపై సమగ్ర పరిశీలన చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి**

**అధికారులు, నాయకులకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే**





కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ మార్చి 28 వింజమూరు మండల కేంద్రంలో ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న "పేదల సేవలో" కార్యక్రమంలో పాల్గొననున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ శనివారం సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతం, పార్కింగ్ సదుపాయాలు, త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం పర్యటన ప్రారంభం నుండి పూర్తయ్యే వరకు అధికారులు, నాయకులు వారికి కేటాయించిన పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, ప్రజలకు ఉపయోగకరంగా, పరిపాలనా పరంగా ఆదర్శప్రాయంగా జరిగేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా సమీక్షించారు. అలాగే భద్రతా ఏర్పాట్లను సవివరంగా పరిశీలిస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటన విజయవంతం కావడానికి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు.

# సీఎం పర్యటనలో జలదంకి మండల టిడిపి నేతలు బాధ్యతగా పనిచేయాలి

**పర్యటన విజయవంతంగా జరిగేందుకు కృషి చేయండి**

**జలదంకి మండల టిడిపి అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, సోమశిల ప్రాజెక్టు వైస్ చైర్మన్ పులుగుంట మధుమోహన్ రెడ్డి**



కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ మార్చ్ 28 వింజమూరు మండల కేంద్రంలో ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు జలదంకి మండల టిడిపి నేతలు వారికి కేటాయించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని మండల టిడిపి అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, సోమశిల ప్రాజెక్టు వైస్ చైర్మన్ పులిగుంట పదమోహన్ రెడ్డిలు సూచించారు. శనివారం జలదంకి పద్మావతి కళ్యాణ మండపంలో మండల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ అని, అటువంటి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను అందరూ సమిష్టిగా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలనికోరారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే కార్యకర్తలకు ఆయా గ్రామాల నాయకులు వారికి అందుబాటులో ఉండి వారిని వాహనాల్లో తీసుకురావాలని సూచించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అమరావతి శాశ్వత రాజధానిగా చారిత్రాత్మక నిర్ణయం -- రైతుల త్యాగానికి గౌరవం



శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి, 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం రాజధానిగా ఎంపికైన అమరావతి నిర్మాణం కోసం భూములు సమర్పించిన రైతుల త్యాగానికి ప్రతీకగా అమరావతి నిలిచిందని తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తరువాత రాజధాని అంశంపై నెలకొన్న అనిశ్చితిని తొలగిస్తూ, అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ అసెంబ్లీలో చారిత్రాత్మక తీర్మానం చేయడాన్ని వారు హర్షించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో రాజధాని విషయంలో వచ్చిన వివాదాలు, పలు ప్రయత్నాల మధ్య కూడా అమరావతి తన ప్రాధాన్యతను నిలబెట్టుకుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో అమరావతే ఏపీ రాజధానిగా నిలుస్తుందని, దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు స్పష్టత లభించిందని అన్నారు. అలాగే, అమరావతి అభివృద్ధికి మళ్లీ ఊపు తీసుకురావడానికి ఎన్డీయే కూటమి రూ.58 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించడం శుభపరిణామమని కొనియాడారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాకుండా, ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్‌కు 2026-27 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి ,28 : శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్‌కు 2026–2027 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో సభ్యుల సమక్షంలో ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఆర్. అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.ఎస్. అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం. తులసిరామ్, ఖజాంచీగా కె. దేవి ఎన్నికయ్యారు. అదనంగా జాయింట్ సెక్రటరీగా ఎం. మణిశేఖర్, మహిళా ప్రతినిధిగా సి. సుజాత, క్రీడలు ఽ సాంస్కృతిక కార్యదర్శిగా కాంతా ఉదయ్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా ఎన్. మునిదేవి బాధ్యతలు స్వీకరించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి. సుభాష్, డి. హరిహరన్, ఎ.వి. రాజేష్ రాయల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు న్యాయవాదులు అభినందిస్తూ, బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు కూడా సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, న్యాయవాదుల సంక్షేమం కోసం సమర్థంగా పని చేస్తామని హామీ ఇచ్చారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఒంటిమిట్ట పెన్ పవర్, మార్చి, 28: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారికి కల్యాణోత్సవం సంద ర్భంగా ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో కల్యాణ వేది కను, హెలిప్యాడ్, ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శ్రీధర్ అన్నారు. ఏప్రిల్ 1న శ్రీ కోదండ రామ స్వామి వారి కళ్యాణానికి సంబంధించి వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ శ్రీధర్, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, సివిఎస్ఒ మురళీ కృష్ణ, ఎస్పి నచికేత్ విశ్వనాథ్, జెసి నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఎఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే, టిటిడి, జిల్లా అధికారులు పరిశీలించారు. అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి విజయ వంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. హంస వాహనంపై సీతారాముడు : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు రాత్రి ఏడు గంటల నుండి హంస వాహనంపై శ్రీ సీతా రామలక్ష్మణులు భక్తులను కటాక్షించారు.

# క్రికెట్ బెట్టింగ్‌పై కఠిన చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరిక



చిత్తూరు,పెన్ పవర్, మార్చి 28, దేశవ్యాప్తంగా ఐపీఎల్ ప్రారంభమైన నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు పెరిగే అవకాశ మున్నందున,వాటిలో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి స్పష్టం చేశారు.ఈ మేరకు ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆయన హెచ్చరిక జారీ చేశారు.ఈసందర్భంగాఎస్పీ మాట్లాడుతూ.. క్రికెట్‌ను ఇష్టపడటం తప్పు కాదు,కానీ బెట్టింగ్ వ్యసనంగా మారితే అది జీవితాన్ని నాశనం చేస్తుందని అన్నారు.బెట్టింగ్‌లో ఓటమి కేవలం వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబాలపై కూడా తీవ్రప్రభావం చూపుతుందని, అప్పులు,మానసిక ఒత్తిడి,కుటుంబ విభేదాలు వంటి సమస్యలకు దారితీస్తుందని వివరించారు. కొన్నిసార్లు బెట్టింగ్‌లో భారీ నష్టాల వల్ల వ్యక్తులు ఆత్మహత్యలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే గ్యాంగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బెట్టింగ్ నిర్వహించడం, ప్రోత్సహించడం లేదా పాల్గొనడం నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ ఎప్పుడూ నష్టమే -- చివరికి జీవితాన్ని, కుటుంబాన్ని, భవిష్యత్తును కూల్చేస్తుంది. కాబట్టి బెట్టింగ్ కంటే జీవితాన్ని ప్రేమించి, కుటుంబాన్ని కాపాడుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించే ప్రయత్నాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధిక లాభాల ఆశతో బెట్టింగ్ మాఫియా వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తూ, మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.సమాచారం అందించిన వారి గోప్యతను కాపాడుతామని హామీ ఇచ్చారు.జిల్లాలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు లేదా ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 లేదా చిత్తూరు పోలీస్ వాట్సాప్ నంబర్ 9440900005 ద్వారా లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

# అక్రమ గంజాయి రవాణాలో వ్యక్తి అరెస్ట్.

## --1.8 కేజీల గంజాయి స్వాధీనం.




తిరుపతి క్రైమ్ బ్యూరో,పెన్ పవర్, మార్చి 28. తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాల క్రాస్ వద్ద గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 1.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారుతిరుపతి రూరల్ పోలీసులు. ఈ సందర్భంగా తిరుపతి రూరల్‌సీఐ మద్దయ్యఆచారి మాట్లాడుతూ..... అవిలా లకు చెందిన సాయి ప్రసాద్ ఎం కె నాయుడు కాలనీ అవిలాల క్రాస్ వద్ద గంజాయిని తరలిస్తూ ఉండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుబడ్డ వ్యక్తిని సోదా చేయగా అతడి వద్ద 1.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు అయితే పట్టుబడ్డ సాయి ప్రసాద్ అతడి స్నేహితుడు గౌరీ శంకర్ తో కలిసి ఒరిస్సా రాష్ట్రం బరంపూర్ నుంచి గంజాయిని తిరుపతికి తీసుకువచ్చే వారని, గంజాయిని 10 గ్రాముల చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కొక్క ప్యాకెట్ 500 చొప్పున విద్యార్థులకు అమ్ముతున్నట్లు పట్టుబడ్డ ముద్దాయి తెలిపారు అన్నారు. ఇందులో ప్రమేయం ఉన్న మరికొందరిని కూడా అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడ్డ సాయి ప్రసాద్ ను ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తరలిస్తున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో చెడ్డి గ్యాంగ్ హల్చల్.

## చెడ్డి గ్యాంగ్ చోరీ యత్నం విఫలం.




తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మార్చి 28. తిరుపతి నగరంలో చెడ్డి గ్యాంగ్ శుక్రవారం తెల్లవారుజామున హల్చల్ చేశారు. ఓ ఇంటిలోకి ప్రవేశించి చోరీకి ప్రయత్నం చేయగా కుటుంబ యజమాని అప్రమత్తతతో పరారయ్యారు. తిరుపతి రూరల్ సీఐ మద్దయ్య ఆచారి వివరాల మేరకు..... తిరుపతి రూరల్ పరిధిలోని రఘునాథ రిసార్ట్స్ సమీపంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ అధినేత కుటుంబం నివాసం ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు సభ్యులు ఉన్న చెడ్డి గ్యాంగ్ ఇంటిలోకి ప్రవేశించిందని ఇంటి యజమాని సునంద కుమార్ రెడ్డి అప్రమత్తతతో చోరులు పరారైనట్లు తెలిసిందన్నారు. కాగా ఇంటిలో ఉన్న సీసీ కెమెరాలు చెడ్డి గ్యాంగ్ ఇంటిలోకి చొరబడిన దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. బాధితులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చెడ్డి గ్యాంగ్ ఇంటిలో ప్రవేశించిన పలు ప్రాంతాలలో ఉన్న సిసి ఫుటేజ్ ను పోలీసులు సేకరించి నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

# వేణుగానాలంకారంలో కోదండరాముడు



ఒంటిమిట్ట (కడప జిల్లా) : పెన్ పవర్, మార్చి, 28: కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారిని వేణుగాన అలంకారంలో అలంకరించారు. ఉదయం 7.30 గంటల నుండి ఊరేగింపు జరిగింది. ఉదయం 11 గంటలకు ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. రాత్రి ఏడు గంటల నుండి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో హంస వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ ప్రశాంతి, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

# మడిబాక--రాజులకండ్రిగలో విద్యుత్ బలోపేతం : 7 ట్రాన్స్‌ఫార్మర్లు, 250 పోల్స్ ఏర్పాటు



ఏర్పేడు, పెన్ పవర్, మార్చి, 28: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ పరిధిలోని మడిబాక మరియు రాజులకండ్రిగ గ్రామాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతానికి ముఖ్యమైన పనులు పూర్తి అయ్యాయి. రెడస్ (రేవంపేడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ ) ఆధ్వర్యంలో మొత్తం ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు మరియు 250 విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. మడిబాక గ్రామంలో మూడు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒకటి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా, రాజులకండ్రిగ గ్రామంలో రెండు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒకటి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా 9 మీటర్ల ఎత్తు గల 100 పోల్స్, 8 మీటర్ల ఎత్తు గల 150 పోల్స్ మొత్తం 250 విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. రాజులకండ్రిగ గ్రామంలో ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, స్థానిక సర్పంచ్ కడివెళ్ళ చెంగల్ రాజు, =ఋూ సూపర్‌వైజర్, సచివాలయ లైన్‌మన్ ఢిల్లీ బాబు, రాజా తదితర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య మాట్లాడుతూ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో రాజులకండ్రిగ గ్రామానికి నాణ్యమైన మరియు నిరంతరాయ (24ఐ7) విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. అలాగే ఓవర్‌లోడ్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ పనులు విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన సర్పంచ్ కడివెళ్ళ చెంగల్ రాజు మరియు గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గెంజి రవియాదవ్, గుండ్రాజు మురళి రాజు, మధుసూదన్ రాజు, భక్తవత్సలం, సాల్వ హరి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈనెల 30, 31 న గవర్నర్ పర్యటన.

## ఎస్. వి. వెటర్నరీ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రాక.



తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మార్చి 28. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఈ నెల 30, 31 తేదీలలో తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా ఈ నెల 30న మ.2.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, మధ్యాహ్నం .3.00 గం.లకు తాజ్ హోటల్ చేరుకుంటారన్నారు. అనంతరం తాజ్ హోటల్ నుండి బయల్దేరి సా.4.00 గం.లకు శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ చేరుకుని విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అలాగే సాయంత్రం 6.25 గం. లకు తిరుమల భాగ్య రెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారన్నారు. మరుసటి రోజు ఉదయం 9.30 గం.లకు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని మ.2.00 గం.లకు తిరుమల నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, అనంతరం మధ్యాహ్నం 3.20 గం.లకు హైదరాబాద్ బయల్దేరి వెళతారన్నారు.

# సంగం గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మేకపాటి శాంతి కుమారి





సంగం పెన్ పవర్ మార్చి 28. మేకపాటి శాంతి కుమారికి ఘన స్వాగతం పలికిన టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి,టీడీపీ నాయకులు శ్రీనివాస చౌదరి,శ్రీనివాసులు నాయుడు గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి.. రికార్డులను తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని లైబ్రేరియన్ కు సూచించిన మేకపాటి శాంతి కుమారి గ్రంథాలయం పునర్నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని పిలుపు జిల్లాలో గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ బకాయిల వసూళ్లకు కృషి చేస్తున్నా:గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి మంత్రి నారా లోకేష్ సహకారంతో జిల్లాలో గ్రంథాలయాలను అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం:గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి

# కత్తి మహేష్ ఆధ్వర్యంలో శ్రీ రామ కృష్ణ స్వామివారికి పట్టాభిషేకం





బుచ్చిరెడ్డిపాలెంపెన్ పవర్ మార్చి.28. బుచ్చిరెడ్డిపాలెం మండలం నాగమాంబాపురం శ్రీరామ కృష్ణ స్వామివారికి పట్టాభిషేకం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, వేదమంత్రాలు నడుమ, వేద పండితులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అన్నదానం కార్యక్రమము నిర్వహించారు ఉభయదారులుగా కత్తి మహేష్ ప్రశాంతి దంపతులు వ్యవహరించారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించిన ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్







శ్రీకాళహస్తి , పెన్ పవర్, మార్చి, 28: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీ), జనసేన పార్టీ మీడియా హెడ్ పిడుగు హరి ప్రసాద్ కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ కి మరియు వారి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న ఆయనకు పండితులు ఆశీర్వచనాలు అందజేసి, తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, ఈర్ల చిరంజీవి, లీలదర్, పసుపులేటి నవీన్, రఘు, సుధాకర్ తదితరులతో పాటు ఆలయ అధికారులు మరియు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

# అమరావతికి చట్టబద్ధతపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం -- మంత్రివర్యులు నారా లోకేష్‌తో మర్యాదపూర్వక భేటీ





శ్రీకాళహస్తి,పెన్ పవర్,మార్చి,28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామంగా భావించబడుతోంది. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ఈ అంశంపై ప్రభుత్వం ముందడుగు వేయడం పట్ల ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. ఈ సమావేశం అనంతరం మంత్రివర్యులు నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, రాజధాని అమరావతి అంశంపై వివిధ కోణాల్లో చర్చించడం జరిగింది. రాష్ట్ర అభివృద్ధి దిశగా అమరావతి నిర్మాణానికి చట్టబద్ధత కల్పించడం అవసరమనే అంశంపై అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే, రేపు జరగనున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రివర్యులకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కూడా స్వల్పంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేసిన కమిషనర్






బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 28. బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ( ఎస్ ఏ ఎస్ ఏ ) కార్యక్రమం విజయవంతంగా జరిగింది. సాధారణంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమం,ఈసారి ప్రత్యేకంగా నాల్గవ శనివారం నిర్వహించారు. ఈ నెల థీమ్‌గా సోర్స్ సిగ్రిగేషన్ జీరో వేస్ట్ లిఫె స్టైల్" ను ఎంచుకుని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చలివేంద్రం సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా బృందాలు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మరియు జీరో వేస్ట్ జీవన విధానం పాటించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ర్యాలీ అనంతరం వారాహీ'స్ నెక్స్ట్ జెన్ స్కూల్ విద్యార్థులు సోర్స్ సిగ్రిగేషన్ పై ఆకట్టుకునే స్కిట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విద్యార్థుల ప్రదర్శనను ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో చెత్త వేరు చేసే అలవాటు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అదనంగా, ప్రతి వార్డులో "వార్డ్ స్వచ్ఛ ఛాలెంజ్ " నిర్వహించి, ఉత్తమంగా పనిచేసిన వార్డులను "బెస్ట్ స్వర్ణ వార్డ్ " గా ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని తెలిపారు. పాఠశాలలు, కాలేజీలు మరియు జీరో వేస్ట్ విధానాలను ప్రోత్సహించే వ్యక్తులను కూడా గుర్తించి సత్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 1 నుంచి స్వర్ణ వార్డ్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి (హౌసేహోల్డ్ కాంపెయినింగ్ ) ప్రజలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. చెత్తను వేరు చేయడం, సరైన విధంగా మున్సిపల్ వాహనాలకు అందించడం, మరియు జీరో వేస్ట్ విధానాలను ప్రతి కుటుంబం పాటించేందుకు ఈ ప్రచారం దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చెత్త వేరు చేయడం, వ్యర్థాలను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై మరింత చైతన్యం పెరిగింది. బుచ్చిరెడ్డిపాలెంను స్వచ్ఛమైన, పచ్చని పట్టణంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# స్థంభ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహణ



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 28. జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో మే 7, 2026 నుండి మే 17, 2026 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆది ఘట్టంగా నిర్వహించిన స్థంభ ప్రతిష్ట మహోత్సవం శనివారం ఆలయ ప్రాంగణం లో అత్యంత వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల నడుమ, అర్చకుల ఆశీర్వాదాలతో ఈ పవిత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. దేవస్థానం అర్చకులు శాస్త్రోక్త విధానంలో స్థంభ ప్రతిష్ట నిర్వహించగా,భక్తులు పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, మంగళవాద్యాల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పాలక మండలి సభ్యులు నక్కల శివ కృష్ణ పెన్నత్తురు సుమలత జొన్నలగడ్డ వరలక్ష్మి కీలుకుప్ప శ్రీనివాసులు ముంగర సుధాకర్ ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు కార్యనిర్వహణాధికారి

# కత్తవ చెరువు ఆక్రమణలపై ఆందోళన -- అధికారుల చర్యలు ప్రారంభం




నరసరావుపేట పెన్ పవర్ మార్చి 28: నరసరావుపేట పట్టణంలోని కత్తవ చెరువు ఆక్రమణలపై స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న కోట్ల రూపాయల విలువైన ఈ చెరువు భూమి క్రమంగా కబ్జాకు గురవుతోందని ఆరోపిస్తున్నారు. దాదాపు 40 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో ఇప్పటికే సుమారు 5 ఎకరాలు అన్యాక్రాంతమైందని సమాచారం. ఆక్రమణదారులు మున్సిపాలిటీ నిర్మించిన కాల్వలను కూడా ధ్వంసం చేసి, చెరువు భూమిని స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని తెలుస్తోంది. ఆక్రమించిన ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్సులు నిర్మిస్తూ భారీగా ఆర్థిక లాభాలు పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేటి ఉదయం నుంచి చెరువులోని మట్టిని అక్రమంగా తవ్వుతూ మైనింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం ఘటన స్థలానికి చేరుకుని జెసిబి యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి చెరువు పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే మరింత భూకబ్జా జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని



చెరువులను కాపాడటం అత్యంత అవసరమని, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అమరావతి శాశ్వత రాజధాని తీర్మానానికి గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ మద్దతు.. ,కొండి శెట్టి సురేష్ బాబు..

పెన్ పవర్, విజయవాడ, మార్చి, 28. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అంశం చాలా కీలకమైనది. ఈ నేపథ్యంలో అమరావతిని శాశ్వత రాజధానిగా కొనసాగించాలనే తీర్మానానికి గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ తమ పూర్తి మద్దతును ప్రకటిస్తోంది. ఈ సందర్భంగా జీ వీ ఎన్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొండి శెట్టి సురేష్ బాబు మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణం అనేది కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రతీక. రైతులు స్వచ్ఛందంగా తమ భూములను ఇచ్చి, రాజధాని నిర్మాణానికి సహకరించారు. వారి ఆశయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. రాజధాని విషయంలో ఎలాంటి అనిశ్చితి ఉండకూడదు. అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో ప్రజలను గందరగోళానికి గురి చేయడం తగదు. అమరావతి శాశ్వత రాజధానిగా ఉండటం ద్వారా రాష్ట్రానికి



స్థిరత్వం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ తరఫున మేము స్పష్టం చేస్తున్నాం---అమరావతి శాశ్వత రాజధానిగా కొనసాగాలని మేము బలంగా కోరుతున్నాం. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి." ఇకపై కూడా ప్రజా ప్రయోజనాల కోసం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు...

# ప్రజల అవసరార్థం చేతి పంపు ప్రారంభం

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 28: అద్దేపల్లి,భట్టిప్రోలు గ్రామాలలో,మొదటి వార్డు నందలి అంకమ్మ తల్లి దేవాలయం సమీపంలో పంచాయతీ వాటర్ ట్యాప్‌ను గ్రామ సర్పంచ్ దారా రవికిరణమయి చన్నయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగు నీటి అవసరార్థం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభించిన పంచాయతీ పబ్లిక్ టాపును ఏర్పాటు చేయుటం పట్ల ఆ ప్రాంతవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ టాప్ ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంత వాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా తాగునీరు అందుబాటులో కి వచ్చినట్లు అవుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ



కార్యక్రమం లో కొలుసు శేషమ్మ శ్రీనివాసరావు(మొదటి వార్డు సభ్యులు),గ్రామ ఉపసర్పంచ్ బూర్లె రామ ప్రసాదు,ప్రజలు పాల్గొన్నారు.

# అమరావతి ఉన్నంతవరకు చంద్రబాబు పేరు శాశ్వతం....ఎమ్మెల్యే నసీర్...

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 28. ఆంధ్రుల రాజధాని కలను సాకారం చేసిన మహా గొప్ప నాయకులని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం అసెంబ్లీలో రాజధాని అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ కు రాజధాని నిర్మాణం కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. అమరావతి సాంస్కృతికంగా, వాస్తు పరంగా, చారిత్రాత్మకంగా ఆంధ్రుల రాజధానిగా సరైన ప్రదేశమని నిర్ణయించారని చెప్పారు. రాష్ట్రంలోని నలువైపులా ప్రజలకు అమరావతి సమాన దూరంలో ఉంటుందని అన్నారు. దేవతల రాజధానిగా ఉన్న అమరావతిని సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రజా రాజధానిగా మార్చారని పేర్కొన్నారు. 80 పుణ్య క్షేత్రాలతోపాటు యమునా నది నుంచి నీరు తీసుకొచ్చి రాజధానికి పునాదులు వేశారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని ప్రాంతంలో రోడ్లు తవ్వేశారని, పైపులైన్లు ఎత్తుకెళ్లారని విమర్శించారు. అమరావతిని ఒక నగరంగా కాకుండా ప్రపంచ పటంలో గొప్ప రాజధానిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పంట భూములే ప్రాణంగా జీవించే రైతులు సైతం 33 వేల ఎకరాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఒక్క పిలుపుతో రాజధానికి ఇవ్వడం చరిత్రాత్మకమని చెప్పారు. అమరావతిని ఆర్థిక, విద్య, వైద్య, ఎలక్ట్రానిక్, విజ్ఞానం వంటి తొమ్మిది రకాల విభాగాల్లో గొప్ప రాజధానిగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు. సింగపూర్ మాస్టర్ ప్లాన్ తో పాటు జపాన్ సహకారంతో పరిశ్రమల స్థాపనకు ముందడుగు వేశారని వెల్లడించారు. నగరీకరణను భారంగా కాకుండా అవకాశంగా మార్చుకొని



పక్కా ప్రణాళికతో నిర్మిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో హైకోర్టు, అసెంబ్లీ అమరావతి పేరు వింటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తొస్తారని, అమరావతి కేవలం పాఠ్య పుస్తకాలలోనే కాదని, ఒక చరిత్రలో మిగిలిపోయేలా నిర్మాణం చేపట్టారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అమరావతి రాజధాని తీర్మానంపై మాట్లాడే అవకాశం ఇచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు...

# మాంసం, చేపల విక్రయాలు పూర్తిగా నిషేధం... నగర కమిషనర్ కె.మయూర్ అశోక్....

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 28. ఈ నెల 31వ తేదీ (మంగళవారం) మహావీర్ జయంతి సందర్భంగా గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాంసం, చేపల విక్రయాలు పూర్తిగా నిషేధిస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహావీర్ జయంతి రోజున మాంస విక్రయాలు నిషేదం అమలులో ఉంటుందన్నారు. నగరంలోని మాంస, చేపల విక్రయదారులే కాకుండా, హోటల్స్, రెస్టారెంట్లకు కూడా ఈ నిషేధ ఉత్తర్వులు అమలవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ సిఎంఓహెచ్ నగరంలోని అన్ని డివిజన్ల శానిటరీ ఇన్స్పెక్టర్లకు నిషేధం అమలుపై ప్రొసీడింగ్స్ జారీ చేశారని, ప్రతి దుకాణంకు నిషేధంపై నోటీసులు ఇవ్వాలని




ఆదేశించామన్నారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు వార్డ్ ల వారీగా నిషేదం అమలును పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు....

# డిజిటల్ యుగంలో సోషల్ మీడియా కీలక సాధనం... వెలగలేటి గంగాధర్...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 28. గుంటూరు: భారతీయ జనతాపార్టీ పశ్చిమ నియోజకవర్గం 3వ మండలంలో (బ్రాడీపేట) బిహెచ్ కాలేజీ నందు జరిగిన ప్రశిక్షణ వర్గ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా, సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈకార్యక్రమానికి ముఖ్య వక్తగా బిజెపి రాష్ట్ర మీడియా కో కన్వీనర్ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రజలతో నేరుగా అనుసంధానం కలిగించే అత్యంత శక్తివంతమైన సాధనమని తెలిపారు. ముఖ్యంగా ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు వేగంగా మరియు విస్తృతంగా చేరవేయవచ్చని పేర్కొన్నారు. అలాగే నమో యాప్ మరియు సరల్ యాప్ వంటి డిజిటల్ వేదికలను ప్రతి కార్యకర్త వినియోగించుకోవాలని, వీటి ద్వారా పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ వివరాలు మరియు సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. సోషల్ మీడియా ద్వారా నిజమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడం మరియు ప్రజలతో నేరుగా సంబంధాన్ని పెంపొందించడం కార్యకర్తల బాధ్యత అని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రతి కార్యకర్త సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగిస్తూ, ప్రతి బూత్ స్థాయిలో డిజిటల్ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూడవ మండల అధ్యక్షురాలు బెహర గాయత్రి బిజెపి రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, మహిళామోర్చా జిల్లా కోశాధికారి డాక్టర్ స్రవంతి ఈమని మాధవరెడ్డి, నాగసాయి, జంధ్యాల పవన్ కుమార్, యశ్వంత్ లకార, బాల రంగయ్య, స్టాలిన్ మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# స్వచ్ఛ ఆంధ్రకు కలిసికట్టుగా కృషి చేయాలి: ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు

చీరాల (బాపట్ల) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. గ్రామాల అభివఅద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండలంలోని గ్రామ పంచాయతీలో నిర్వహించిన సాస ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత అవగాహన కల్పిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి వేటపాలెం మెయిన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందని దీన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. గ్రామాల్లో శుభ్రత, పరిశుభ్రతను కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని ఆయన సూచించారు.

# పేట మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల బాధ్యతలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 28: చిలకలూరిపేట : పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల చిలకలూరిపేట మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పురపాలక సంఘంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పట్టణ అభివృద్ధిపై కీలక దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. మున్సిపల్, శానిటేషన్ ,ఇంజినీరింగ్, రెవెన్యూ, మరియు టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, ప్రజల నుండి వచ్చే అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా పౌర సేవల్లో ఎటువంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పట్టణంలో జరుగుతున్న సివిల్ పనులు, పారిశుధ్య నిర్వహణ మరియు తాగునీటి సరఫరా అంశాలపై ఆమె ప్రత్యేకంగా చర్చించారు.ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మరియు పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

